## క్లుప్తంగా

### పాతాళగంగ మార్గంలో చలివేంద్రం ఏర్పాటు



భక్తులకు మజ్జిగ సరఫరా చేస్తున్న ఈఓ

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైలంలోని పాతాళగంగ మార్గంలో దేవస్థాన సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.ఫణిధర్‌ప్రసాద్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం దేవస్థాన ఈఓ ఎస్ లవన్న చేసి ప్రారంభించారు. ఈ చలివేంద్రం ద్వారా భక్తులకు మజ్జిగ, మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఏఈఓ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు మొదిగొండ లింగాంబ, విశ్వనాథ ఆరాధ్యుల జ్ఞాపకార్థ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరం మేరకు ఉగాది ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా చలివేంద్రాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రామకృష్ణ, డీఈఈ నరసింహారెడ్డి, శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ అనీల్‌కుమార్, ఏఈ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చెంచుల స్థితిగతుల పరిశోధనకు ఎంఫిల్ పట్టా



శంకరనారాయణకు ఎంఫిల్ పట్టా అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు

**శ్రీశైలం:** శ్రీశైలం మండలంలో చెంచుల సామాజిక – ఆర్థిక పరిస్థితులపై పరిశోధన చేసిన మహేశ్వరం గారి శంకరనారాయణకు పొట్టి శ్రీరాములు తెలుగు యునివర్సిటీ పీఠాధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు ఎంఫిల్ పట్టాను అందజేశారు. ఆదిమజాతి గిరిజన తెగలలో భాగమైన చెంచుల జీవనవిధానంలో వచ్చిన, వస్తున్న మార్పులు, వారినిమరింత అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకోవలసిన చర్యలను తనపరిశోధనలో చక్కగా వివరించారని పీఠాధిపతి తెలిపారు. ఈ పరిశోధన అంశానికి పర్యవేక్షకులుగా పూర్వ పీఠాధిపతి ఆచార్య పి.చెన్నారెడ్డి వ్యవహరించారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథశాస్త్రి, డాక్టర్ శోభన్‌బాబు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### కొలతల ప్రకారం పనులు చేయాలి



ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ మేరి

**కొత్తపల్లి:** గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలు కొలతల ప్రకారం చేయాలని, ఆ విధంగా చేస్తేనే సరైన వేతనం లభిస్తుందని ఎంపీడీఓ మేరి తెలిపారు. గురువారం మండల పరిధిలోని శివపురం గ్రామ చెరువులో చేస్తున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ముందుగా హాజరు మస్టర్‌ను, కొలతల మేరకు పనిచేస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు కూలీలు పనిప్రదేశంలో 4 గంటలు ఉండాలని, ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు ఉన్నారు.

### టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌కు అవార్డు



సునీల్‌రాజు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్

**ఆత్మకూరు:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లాన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సునీల్‌రాజు ఈ ఏడాది మనం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో అందించే ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు తనకు సమాచారం అందిందని గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో వివిధ సంస్థల మేధావుల ద్వారా ఈ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక సేవలో భాగంగా ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

### సంతమార్కెట్ వేలం

**పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్ గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన ఈఓఆర్డీ పుల్లయ్య గ్రామ బండిమెట్టు, సంతమార్కెట్‌కు బహిరంగ వేలాలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో ప్రభుత్వం నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి ఆరుగురు సభ్యులు పాల్గొన్నారు. సంతమార్కెట్, బండి మెట్ట కలిపి ప్రభుత్వం అప్సెట్ ప్రైజ్ కింద రూ.76,466లుగా నిర్ణయించారు. కాగా వేలం పోటాపోటీగా సాగింది. పి.లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అత్యధికంగా రూ.83,200లకు పాట పాడి వేలాలను దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్, సచివాలయ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ జలం

- గ్రామాల్లో రక్షిత మంచినీటి కోసం నిధుల మంజూరు
- జలజీవన్ మిషన్ కింద జోరుగా పనులు
- వేసవిలోపు పలు గ్రామాలకు మంచినీటి సౌకర్యం

**ఆత్మకూరు:** వేసవి వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు నీటి కోసం అవస్థలు పడాల్సి వచ్చేది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు శ్రీకారం చుట్టాయి. జలజీవన్ మిషన్ కింద నిధులు కేటాయించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు పైపులైన్ పనులు చేపట్టాయి. ఈ నిధులతో శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని పలు గ్రామాల్లో జోరుగా పనులు సాగుతున్నాయి.

**తొలివిడత 23 గ్రామాలకు రూ.14.01 కోట్లు మంజూరు**

శ్రీశైలం నియోజకవర్గంలో తొలివిడత 23 గ్రామాలకు రూ.14.01 కోట్లు మంజూరు కాగా పనులు జోరుగాసాగుతున్నాయి. ఇందులో ఆత్మకూరు మండలంలో బాపనంతపురం గ్రామంలో రూ7.35 లక్షలు, కొత్తరామాపురం రూ.9.65 లక్షలు, కురుకుంద రూ.9 లక్షలు, వడ్లరామాపురం రూ.6.45 లక్షలు, పెద్దనంతపురం రూ.11.95 లక్షలు , శ్రీశైలం మండలంలోని సున్నిపెంట, శ్రీశైలానికి రూ.2,07,65,000, వెలుగోడు మండలంలో అబ్దులాపురం 19.55లక్షలు, అయ్యవారిపల్లి రూ.8లక్షలు, బోయరేవుల రూ.65.75 లక్షలు, గుంతకందాల రూ.44.20 లక్షలు, మాధవరం రూ.23.35 లక్షలు, మోతుకూరు రూ.31.10 లక్షలు, రేగడగూడూరు 49.05 లక్షలు, తిమ్మనపల్లి రూ.23లక్షలు, వేల్పనూరు రూ.67.15 లక్షలు కేటాయించారు. బండిఆత్మకూరు మండలంలో నారపుకుంట రూ.13 లక్షలు, మణికంఠాపురం రూ.13 లక్షలు, పడమటూరు రూ.30 లక్షలు, ఎర్రగుంట్ల రూ.34 లక్షలు, చిన్నదేవులాపురం రూ.29.89 లక్షలు, బండిఆత్మకూరు రూ.82.94 లక్షలు, కాకనూరు 29.45 లక్షలతో పనులు చేపట్టారు. మహానంది మండలంలో మహానంది రూ.11.20 లక్షలు, బోయలకుంట్ల క్రాస్‌రోడ్డు రూ.1.97 లక్షలు, బుజ్జమ్మతోపు రూ.3.58 లక్షలు, అయ్యన్న నగర్‌కు రూ.9.13 లక్షలు మంజూరయ్యాయి.



వడ్లరామాపురంలో ఓ ఇంటివద్ద కుళాయి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**వేగంగా పనులు**

ఇప్పటికే ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో, మహానంది మండలంలోని బుజ్జమ్మతోపు గ్రామాల్లో 90 శాతంపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా మండలాల్లో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. పనులు పూర్తయితే తమ ఇంటి వద్దనే కుళాయిల ద్వారా ప్రజలు రక్షిత మంచి నీటిని పొందే అవకాశం ఉంది. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చొరవతో రెండో విడుత కూడా పనులు మంజూరయ్యాయి. మరిన్ని గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కోసం 68 పనులకు గాను రూ.3,71,08,80లు కేటాయించారు. వీటిని త్వరలోనే చీఫ్‌ఇంజనీర్ కార్యాలయం నుంచి టెండర్లను అధికారులు పిలవనున్నారు.



మహానందిలో కొనసాగుతున్న పైపులైన్ పనులు

**ఎమ్మెల్యే కృషితో మంచినీటి సౌకర్యం**



వేసవిలో ప్రజల మంచినీటి ఎద్దడిని తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి వడ్లరామాపురం గ్రామంలో ఇంటింటికీ మంచినీటి సౌకర్యం కల్పించేందుకు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలోనే ఆయన చేతుల మీదుగా ఇంటింటికి కుళాయి కనెక్షన్లను ప్రారంభించనున్నారు. మంచినీటి సమస్య పరిష్కారం అయినందుకు ఎంతో సంతోషంగా ఉంది.
– పుల్లారెడ్డి, వడ్లరామాపురం

**సంతోషంగా ఉంది**



త్వరలో మా గ్రామంలో ఇంటింటికీ మంచి నీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో వేసవి వచ్చిందంటే బోరుబావులు ఎండిపోతే సుదూరంగా ఉన్న బోర్లవద్దకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అధికారులు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు పనులు చేపట్టడం సంతోషంగా ఉంది.
– బందెలమాబు, కురుకుంద

**పనులు త్వరగా పూర్తి చేస్తాం**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరైన నిధులతో త్వరలోనే పనులు వేగవంతంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే పనులు పూర్తి చేసి అన్ని మండలాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ వేసవిలో పలు గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– శ్రీనివాసులు, డీఈఈ , ఆత్మకూరు

### దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

**శ్రీశైలంటెంపుల్:** లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ముందుగా పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

### మహానందీశ్వరుడికి ఏకాంతసేవ పూజలు

**మహానంది:** మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు గురువారం రాత్రి ఏకాంతసేవా పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను పుష్పమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం అలంకార హారతులు శాస్త్రోక్తంగా చేపట్టారు. స్థానిక యాగశాలలో విశేషపూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

### ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించడం హర్షణీయం

**జూపాడుబంగ్లా:** వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు రూ.10,812 కోట్లు కేటాయించడం హర్షణీయమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్ రాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన కులాల వారికి ప్రాధాన్యత లభిస్తోందన్నారు. 2023–24 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించటం శుభపరిణామమన్నారు.

## నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్య విత్తన గుళికల తయారీని వివరిస్తున్న అధికారులు

**కొత్తపల్లి:** పొలంలో నవధాన్య విత్తనాలు సాగు చేసుకోవడంతో నేలలో సారవంతత పెరుగుతుందని పకృతి వ్యవసాయం జిల్లా అధికారి నరేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామసచివాలయం పరిధిలోని పాలెంచెరువు గూడెంలో నవధాన్యాల సాగు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యాల విత్తనాలను భూమిలో పంటసాగుకు కావాలిసిన పోషకాలు అందుతాయని చెప్పారు. ఎండకాలంలో ఎండ నేరుగా భూమిని తగలటం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు చనిపోకుండా ఈ సాగు పనిచేస్తుందన్నారు. నేలలో నీటి నిల్వల సామర్థ్యం పెరుగుతుందని, జీవవైవిద్యం పెంచుంతుందని చెప్పారు. నవధాన్యాల సాగువల్ల ఖరీఫ్ సీజన్ పంటసాగు బాగా ఉండి అధిక దిగుబడి వస్తుందని, పంటకు కావాల్సి పోషకాలు లభిస్తాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాలలో ఒక్కొక్కరు 5 మంది రైతులు నవధాన్యాలు సాగుచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గూడెం రైతు రాజునాయక్ పొలంలో 30 రకాల విత్తన ధాన్యాలతో నవధాన్య విత్తన గుళికలు తయారు చేసి పొలంలో వేయించారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ సలాం, ఏఈఓ వెంకటనారాయణ, పకృతి వ్యవసాయ విభాగం ఇన్‌చార్జ్ సయ్యద్ బాషా, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జహిద్ బాషా, ఎస్ఆర్పీ నరేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

## భూమి సాంద్రతను కాపాడుకుందాం

**జూపాడుబంగ్లా:** భూమి సాంద్రతను కాపాడుకొని అధిక దిగుబడులు సాధించాలని వైఎస్సార్ క్రాంతి పథం అడిషనల్ డీపీఎం రవీంద్రాచారి, ఏపీఎం అంబమ్మ అన్నారు. గురువారం మండలంలోని పారుమంచాల గ్రామంలో భూసాంద్రతను పరిరక్షించాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్బీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భూసాంద్రతను కాపాడాలంటే రసాయనిక ఎరువులు, గడ్డిమందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. రసాయనిక ఎరువులను అధికమోతాదులో వాడటం వల్ల భూసాంద్రత దెబ్బతిని చౌడునేలలుగా మారే అవకాశాలున్నాయన్నారు. తద్వారా రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిని దిగుబడిలో పించి పంటనష్టం వాటిల్లుతుందని చెప్పారు. భూసాంద్రతను కాపాడుకునేందుకు పచ్చిరొట్టే ఎరువులైన పిల్లపెసర, జీలుగ, పశువులపేడ, సేంద్రీయ ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందికొట్కూరు డివిజన్ ఇన్‌చార్జ్ రామమద్దయ్య, మండల ఇన్‌చార్జ్ దాసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలకు పెద్ద పీట

**నందికొట్కూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 18, 19వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి 33వ సీనియర్ విభాగం పురుషులు, స్త్రీల సెపక్‌తక్రా ఛాంపియన్ షిప్ ఎంపిక పోటీల బ్రోచర్‌ను గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ టోర్నమెంట్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలు పట్టణంలోని జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సెపక్‌తక్రా అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు హమీద్, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, బ్రహ్మయ్య, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్

## అత్యాధునిక పరికరాలతో భూముల రీ సర్వే

**పగిడ్యాల:** అత్యాధునిక పరికరాలతో త్వరలో భూముల రీ సర్వేను కొనసాగిస్తామని తహసీల్దార్ భారతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 9 రెవెన్యూ గ్రామాలలో 4 గ్రామాలు శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురయ్యాయని వివరించారు. ఇప్పటికే ఎయిర్ జెట్ విమానం ద్వారా సర్వే చేశారని, నెల రోజుల్లో మండలానికి మ్యాప్‌లు వస్తాయని చెప్పారు. భూముల రీ సర్వే కోసం అత్యాధునిక పరికరాలైన రోవర్, ఈటీఎస్ మిషన్‌లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 9 రెవెన్యూ గ్రామాల పరిధిలో 37,237.00 ఎకరాలు ఉండగా అందులో 20,905.37 ఎకరాలు ముంపుకు గురయ్యాయన్నారు. ఇంకా 15,842.63 ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే మిగిలిందని వివరించారు. అనంతరం సచివాలయ సర్వేయర్‌లకు 2023 సర్వే డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు ఉన్నారు.

## పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి

**నందికొట్కూరు:** అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రంగన్న, విక్రమ్, వాసవి ఇంటర్నేషనల్ సంఘం సభ్యులు నాగేశ్వరరావు, జయరామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీశైలంప్రాజెక్ట్:** స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య నాయకులు అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఎస్‌వీఎస్ మల్లికార్జున, చిన్నశ్రీనివాసులు , సత్తిబాబు, ఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

**వెలుగోడు :** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు లాలం రామకృష్ణయ్య, ఎంపీపీ లాలం రమేష్, తాళ్లూరి నాగరాజు, తాళ్లూరు రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి**

**ఆత్మకూరు:** పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పువ్వాడి భాస్కర్, ఆత్మకూరు అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు రమేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మావతి బాయి,చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**మహానంది:** ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగాలు మరువలేనివని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. డిప్యూటీ తహసీల్దార్లు కామేశ్వర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కన్నడ భక్తులకు విస్తృత ఏర్పాట్లు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు 5 రోజుల పాటు జరగనున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని అధిక సంఖ్యలో కన్నడ భక్తులు శ్రీగిరి చేరుకుంటున్నారు. వారికోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. కర్ణాటక, మహారాష్ట్ర లోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తమ సొంత గ్రామాల నుంచి సైతం పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్నారు. కన్నడ భక్తుల శివనామస్మరణతో నల్లమల గిరులు మారుమోగుతున్నాయి. ఆత్మకూరు వద్ద గల వెంకటాపురం నుంచి నాగలూటి పెద్దచెరువు, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. పాదయాత్రగా వచ్చే కన్నడ భక్తులు నల్లమల అటవీమార్గంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అటవీశాఖ సహకారంతో జంగిల్ క్లియరెన్స్ చేశారు. కైలాసద్వారం నుంచి భీమునికొలను మెట్ల మార్గం వరకు ప్రత్యేకంగా పైప్‌లైన్లను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేస్తున్నారు. కైలాసద్వారం వద్ద తాగునీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. అలగే భక్తులు సేదతీరేందుకు భారీ షెడ్ ఏర్పాటు చేశారు. పెద్దచెరువు వద్దజిల్లా వైద్యారోగ్యశాఖ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పెద్దచెరువు వద్ద , కైలాసద్వారం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కన్నడ భక్తుల సౌకర్యార్థ దేవస్థానం ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు రోజూ నాలుగు విడుతలుగా మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పించారు. క్షేత్ర పరిధిలో భక్తులు సేద తీరేందుకు చలువ పందిర్లను వేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు నిరంతరం అల్పాహారం తాగునీరు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నారు.



అటవీమార్గంలో పాదయాత్రగా వస్తున్న కన్నడ భక్తులు

### అదాని కుంభకోణంపై పార్లమెంట్ కమిటీ వేయాలి

**నందికొట్కూరు:** అదాని కుంభకోణంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి ఉంటే అదాని కుంభకోణంపై కమిటీ వేసి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, పక్కీర్‌సాహెబ్, గోపాల్‌కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం

**ఆత్మకూరు:** పట్టణంలో గురువారం ప్రారంభమైన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొత్తం 303 విద్యార్థులకు గాను 280 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. థెరిస్సా కళాశాలలో మొత్తం 239 మందికి గాను 231 మంది హాజరు కాగా 8 మంది హాజరు కాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల చీఫ్ వేముల సుజాత తెలిపారు.

**మిడుతూరు:** స్థానిక ఆదర్శ పాఠశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని గురువారం ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 212 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారులు సలీంబాషా, డీఓ రాఘవేంద్ర తెలిపారు.

### రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

**పగిడ్యాల:** బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహ ఏర్పాటు కోసం ఈనెల 24వ తేదిన విజయవాడలో నిర్వహిస్తున్న దళిత, గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, పి.విజయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు.

## పాదయాత్రికులకు మజ్జిగ పంపిణీ





పాదయాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న పోలీసులు

**పాములపాడు:** స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గురువారం పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులకు పోలీసులు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైల భ్రమరాంబా, మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థమై కాలినడక వెళ్తున్న యాత్రీకులు ఎండలో సైతం నడుస్తూ వెళ్తున్నారు. వారు సేద తీరేందుకు షామియానా కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఏసయ్య, హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**కన్నడిగులకు మజ్జిగ పంపిణీ**

**ఆత్మకూరు:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీ జాతీయ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో కన్నడ భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపణీ చేశారు. మరో 3 రోజుల పాటు పంపిణీ కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

### జాతర నిర్వహణపై రేపు సమావేశం

**జూపాడుబంగ్లా:** ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్న తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి జాతర నిర్వహణపై అన్నిశాఖల అధికారులతో ఈనెల 18న సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా వివిధ శాఖల అధికారులతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

**18న తర్తూరు టోల్‌గేటు వేలం**

ఈనెల 18న టోల్‌గేటు వేలం పాటలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ మణిమంజరి, కార్యదర్శి శరత్ తెలిపారు. ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు తర్తూరు లచివాలయం ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.

### వడి వడిగా శ్రీశైలం వైపు అడుగులు

కావడి మోస్తూ, చెక్కకాళ్లపై ముందుకు సాగుతున్న దృశ్యం



**జూపాడుబంగ్లా:** శ్రీశైల భ్రమరాంబికామాత పుట్టింటివారిగా పేర్కొనే కన్నడిగులు స్వామి, అమ్మవార్లపై ఉన్న భక్తితో మండు టెండలను సైతం లెక్కచేయక వందల కిలోమీటర్లు కాలినడకన శ్రీశైలం వెళ్తున్నారు. ఉగాది వేడుకలను పురస్కరించుకొని కర్ణాటక, మహారాష్ట్ర, కొల్హాపూర్, ధార్వాడ్ తదితర ప్రాంతాల నుంచి వందల కిలోమీటర్లు కాలినడక మండుటెండల్లో అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొని వడివడిగా ముందుకు సాగుతున్నారు. భక్తులు అన్నదాన శిబిరాల్లో వడ్డిస్తున్న అన్నపానీయాలను భుజించి మార్గమధ్యలో ఎక్కడ నీళ్లు కనపడితే అక్కడ స్నానాలు ముగించుకొని, చెట్ల నీడన సేదతీరి శ్రీశైలం వైపు సాగిపోతున్నారు.



స్వామివారిని పల్లకీలో శ్రీశైలానికి తీసుకెళ్తున్న భక్తులు

## వెలుగోడుకు పండుగ శోభ

- ఘనంగా రోఖియాబీ ఉరుసు

**వెలుగోడు:** హజరత్ సయ్యదా రోఖియా బీ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని వెలుగోడులో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఉరుసుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మండల కేంద్రంలోని హజరత్ సయ్యదా రోఖియా బీబీ ఉరుసు ఉత్సవాలు గురువారం అర్ధరాత్రి గంధోత్సవంతో ప్రారంభమయ్యాయి. గంధం సమర్పణతో వేడుకలు ప్రారంభం కాగా, శుక్రవారం ఉరుసు నిర్వహిస్తారు.

**హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక**

రోఖియాబీ దువా వల్ల భక్తుల కోర్కెలు అల్లా తప్పక నెరవేర్చుస్తారని ఇక్కడి ప్రజల విశ్వాసం. రోఖియాబీ వారి దర్గా హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి సంతవ్సరం ఉరుసు ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు తరలి వచ్చి ఫాతెహాలు సమరిస్తుంటారు.



విద్యుత్ దీపాల వెలుగులో రోఖియాబీ దర్గా

**పట్టణమంతా పండుగ వాతావరణం**

ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులతో ప్రతి ఇల్లు సందడిగా కనిపిస్తోంది. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన వీధుల వెంట, దర్గా పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. జాయింట్ వీల్, ఐస్ క్రీమ్ బండ్లు, గాజుల అంగళ్లు వెలిశాయి. పిల్లలకు సంబంధించిన బొమ్మల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా సహకారంతో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు.